

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## భరించువాడు

**"మీ నాన్నతో వేగలేకపోతున్నాను** బాబీ నువ్వోసారి వచ్చి ఆయన సంగతి చూడాలి" సులోచన కంఠం ఫోన్‌లో ఖంగున వినిపించింది. శ్రీకర్ పక్కన కూచుని నూడిల్స్ తింటున్న చిత్ర ఫోర్కుని ప్లేట్‌లో పడేసి భర్తకి ఇంకాస్త దగ్గరగా జరిగి ఆ సంభాషణ వినసాగింది.

"ఏమైందమ్మా? నాన్నేం చేసారు?" శ్రీకర్ భార్యవైపు ఇబ్బందిగా చూస్తూ అడిగాడు.

"ఈమధ్య బొత్తిగా మాటవినడంలేదు. డబ్బుని మంచినీళ్ళలా ఖర్చు చేస్తున్నారు. అదేమంటే నీకెందుకు? అని ఎదురు తిరుగుతున్నారు."

"శుక్రవారం రాత్రి బస్సెక్కుతానమ్మా. శనివారం పొద్దునకల్లా ఉంటాను సరేనా?"

"సరే. నువ్వొస్తే నాకు ధైర్యం. తప్పకుండారా" ఆవిడ ఫోన్ పెట్టేసింది.

"నేనూ వస్తా. నాకూ టిక్కెట్ కొను" చిత్ర భర్త భుజం మీద వాలి చెప్పింది.

"సరిగ్గా కూర్చుని నూడుల్స్ తినుకో. అత్తగారిల్లంటే నీకు గొంతు పట్టుకుంటుందిగా! నేనొక్కడినే వెళ్తున్నా" శ్రీకర్ చెప్పాడు.

"అంత సాధుజీవి మామయ్యగారు మీ అమ్మకి చెప్పకుండా డబ్బు ఖర్చు పెట్టేస్తున్నారంటే చిన్నిల్లు సెటప్ చేసారని నా డౌట్" కళ్ళు టపటపలాడిస్తూ చెప్పింది.

"చిత్రా ప్లీజ్" శ్రీకర్ దణ్ణం పెట్టాడు.

"ఏరా! ఎలా ఉన్నావు? అమ్మాయి కులాసానా?" వరండాలో కూర్చుని పేపర్ చదువుకుంటున్న దివాకర్ పేపర్ పక్కన పడేసి కొడుకు చేతిని ఆప్యాయంగా నిమురుతూ అడిగాడు.

"బాగున్నాం నాన్నా." శ్రీకర్ వినయంగా జవాబు చెప్పాడు.

"అమ్మ వంటింట్లో ఉన్నట్లుంది చూడు" ఆయన మళ్ళీ పేపర్ అందుకున్నాడు.

ఇడ్లీ ప్లేట్లలో పిండి నింపుతున్న సులోచన కొడుకుని చూడగానే గరిటని పిండి గిన్నెలో వదిలేసి అతని చేతిలోని బ్రీఫ్‌కేస్‌ని అందుకుంటూ అడిగింది.

"ప్రయాణం బాగా జరిగిందా నాన్నా?"

"ఏం ప్రాబ్లం లేదమ్మా. మొహం కడుక్కొస్తా. కాఫీ ఇవ్వు" శ్రీకర్ తనగదిలోకి వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం భోజనాలయ్యాక సులోచన భర్తని, కొడుకుని సమావేశపరిచింది.

"మీ నాన్న వాలకం ఏమీ బాగాలేదురా బాబీ. డబ్బుని మంచినీళ్ళలాగా ఖర్చుపెట్టేస్తున్నారు. ఏం చేసారంటే చెప్పరు. రెండోసారి అడిగితే కస్సుమంటున్నారు. కనీసం నీకైనా చెప్తారేమో అడుగు" కొడుకుతో చెప్పింది.

"వీడు హఠాత్తుగా రావడానికి అదా కారణం? నువ్వే రమ్మన్నావా?" దివాకర్ గొణిగాడు.

"అవును. వాడికి తప్ప ఇంకెవరికి చెప్పుకోను?" సులోచన గొంతు పెంచి అడిగింది. శ్రీకర్‌కి ఆ పరిస్థితి ఇబ్బందిగా ఉంది. నాన్నని తను నిలదీయడం ఏమిటి? ఆయన్ని ఖర్చులడగాలా?

"ప్లీజ్ అమ్మా!" గొంతు పెగుల్చుకుని చెప్పాడు.

"నీకు తెలుసా బాబీ ఈ ఆర్నెల్లలో మీ నాన్న పదిలక్షలకి పైనే ఖర్చు పెట్టారు. ఏం చేసారంటే చెప్పరు. మొన్న బేంక్ స్టేట్‌మెంట్ చూసేసరికి గుండె ఆగినంత పనైంది తెలుసా?" సులోచన దుఃఖంగా చెప్పింది.

శ్రీకర్ తండ్రివైపు చూసాడు. ఆయన దెబ్బతిన్న పక్షిలా భార్యవైపే చూస్తున్నాడు.

"ఒకటా రెండా ప్పదిలక్షలు" ఆవిడ మళ్ళీ నొక్కి చెప్పింది.

"నువ్వు ఈ పంచాయితీ పెట్టడానికే అబ్బాయిని రమ్మన్నావా?" దివాకర్ నిస్సహాయంగా అడిగాడు.

"అవును. మరి చెప్పుకునేందుకు నాకెవరున్నారు? నా కొడుకేగా?" సులోచన చెప్పింది.

"కనీసం నీకు కొడుకైనా ఉన్నాడు..." ఆయన గొణిగాడు.

శ్రీకర్ చటుక్కున లేచి తండ్రి పక్కన కూర్చుంటూ చెప్పాడు.

"అమ్మేదో చాదస్తంగా మాట్లాడుతోంది పట్టించుకోకు నాన్నా"

"చాదస్తంకాదు. ఇవాళ తేలిపోవాలి. ఆ ఖర్చులేమిటో, ఏం చేస్తున్నారో నాకు తెలియాలి" సులోచన ఖరాఖండీగా చెప్పింది.

దివాకర్ ఆవిడ వైపు చూడకుండా శ్రీకర్‌తో చెప్పాడు.

"నా గురించి నీకు పెద్దగా తెలీకపోవచ్చు బాబీ! అంటే నాన్న అనే ఈ సాధుజీవి తప్పించి నీకు నేను పూర్తిగా తెలీదు"

ఆ పద ప్రయోగానికి శ్రీకర్ ఆశ్చర్యపోయాడు. తనకి తెలియని నాన్న గురించి ఆయన చెప్పేది నిజమే రోజూ చూసే నాన్న బాహ్యరూపం తప్పించి ఆయన మనసులోకి తనెన్నడూ చూడలేదు. అమ్మయితే స్వతంత్రంగా అన్నీ చెప్తుంది. నాన్న మొదట్నించీ మౌని. ఆయన మనసులో ఏముందో తెలీదు. తెలుసుకునే ప్రయత్నం కూడా తనెప్పుడూ చేయలేదు.

"గోల్డెన్ స్పూన్ అననుకాని నేను సిల్వర్ స్పూన్‌తోనే పుట్టాను. నీలాగే అమ్మా నాన్నలకి ఒక్కణ్ణే. మంచి కుటుంబవాతావరణం. ఏకైక సంతానాన్ని అని వాళ్ళు గారాబం చేసి పాడుచేయలేదు. నేనూ బుద్ధిగా చదువుకున్నాను. ఇరవై మూడేళ్ళకి నాకు సెంట్రల్ గవర్నమెంట్‌లో గ్రేడ్ టూ ఆఫీసర్‌గా డైరెక్ట్ పోస్టింగ్ వచ్చింది. పాతికేళ్ళకి మీ అమ్మతో పెళ్ళయింది"

"ఇప్పుడా సోదంతా ఎందుకు? పది లక్షలేమయ్యాయో చెప్పండి ముందు" సులోచన అరిచింది.

ఆవిడ అరుపులు పట్టించుకోకుండా దివాకర్ చెప్పాడు.

"మా నాన్నకి కొన్ని ఆదర్శాలున్నాయి. దాంతో బహు సంతానంతో సతమతమయ్యే తన ఫ్రెండ్‌ని కొంతయినా ఊరడించాలని వాళ్ళనించి ఒక్క పైసా ఆశించకుండా తన డబ్బుతో ఆయన కూతురితో నా పెళ్ళి చేసాడు. తను పుట్టింటినించి మా ఇంటికి వచ్చినప్పుడు చేతి సంచిలో రెండు జతల బట్టలు, కాళ్ళకి స్లిప్పర్స్‌తో వచ్చింది అంతే."

సులోచన భర్తవంక కోపంగా చూసింది.

"మీ అమ్మ మంచిదే కానీ తను పెద్ద గొంతుతో మాట్లాడేది. 'ఎందుకలా? మెల్లగా మాట్లాడు. నేను మైలు దూరంలో లేను. నీ పక్కనే ఉన్నాను' అనేవాడ్ని. 'నా కిదే అలవాటు' అన్నది కానీ సరిదిద్దుకునే ప్రయత్నం చేయలేదు. నాదీ ఓ మనిషిని లొంగదీసుకుని, కంట్రోల్‌లో ఉంచుకోవాలనే మనస్థత్వం కాదు. అందుకని సర్దుకుపోయాను. ఆ తర్వాత చాలా విషయాల్లో కూడా" ఆయన కొద్దిసేపు మౌనంగా ఉండిపోయాడు.

"పెళ్ళయిన కొత్తల్లో సులోచన ఓసారి నన్ను ఓ చీరకొనిపెట్టమని అడిగింది. తన దగ్గర డబ్బుండదు అనే విషయం నాకు అప్పుడు స్ఫురించింది. వెంటనే తనకో క్రెడిట్ కార్డ్ ఇచ్చాను. 'నీకు కావాల్సినవి నన్ను అడగక్కర్లేదు. దీంతో కొనుక్కో' అని చెప్పాను. ఆ తర్వాత వెయ్యి, రెండువేలు, ఐదువేలు ఇలా నెలకి బిల్స్ వస్తుంటే కట్టేసేవాడ్ని. ఎందుకంటే నా కొచ్చే జీతంలో అది చాలా తక్కువ. నాకు ఇబ్బందేమీ లేదు. అదీకాక 'పెద్దకుటుంబంలోంచి వచ్చిన తనకి తీరని సరదాలు చాలా ఉంటాయి, అవి తీర్చుకుంటోంది పాపం!' అనుకునేవాడిని. ఓసారి, 1987లో అనుకుంటా లక్షన్నరకి బిల్లు వచ్చింది. నేను నిర్ఘాంతపోయాను. మీ అమ్మని అడిగాను. 'నువ్వు లక్షన్నరతో కిందటి నెల ఏమైనా కొన్నావా? లేక తప్పు బిల్లు వచ్చిందా?' అని. అందులో ఏమైనా తప్పుందా బాబీ?"

లేదన్నట్లుగా శ్రీకర్ తల అడ్డంగా ఆడించాడు.

"ఆ ప్రశ్నకి మీ అమ్మ మండిపడింది. తనకి ఆర్థిక స్వతంత్రం లేదా అని అడిగింది. తనమీద గూఢచారి పనులు చేస్తున్నానని కూడా తిట్టింది. చివరికి దాంతో వడ్డాణం కొనుక్కున్నానని చెప్పింది. నేను మరోసారి నిర్ఘాంతపోయాను. 'అంత పెద్ద వస్తువు కొనుక్కున్నప్పుడు నాకు చూపించలేదే?' అని అడిగాను. 'ఏం మీకెందుకు చూపించాలి? రుజువులు కావాలా? మా పుట్టింటివాళ్ళకి దోచిపెడ్తున్నా అనుకుంటున్నారా?' లాంటి అర్థంలేని మాటలు మాట్లాడింది. ఆ తర్వాత ఇక పూర్తిగా పట్టించుకోవడం మానేసాను. తర్వాత క్రెడిట్ కార్డ్ బిల్స్ బేంక్ అకౌంట్ నించి డైరెక్ట్‌గా వెళ్ళి పోతూండటంతో మా మధ్య ఇక వాటి ప్రస్థావన రాలేదు. రానురాను మీ అమ్మ నా మీద పూర్తి ఆధిక్యతని సంపాదించింది. స్వతహాగా మెతకవాడిని. సర్దుకుపోయేవాడ్ని. పైగా నీ ముందు గొడవలు పడడం నాకు ఇష్టంలేక నిశ్శబ్ధంగా ఉండిపోయాను. నా ఆఫీస్‌కి వేసుకెళ్ళే మూడు సఫారీ సూట్లు, బయటికి వెళ్ళేప్పుడు వేసుకునేందుకు నాలుగైదు షర్టులు, రెండు పేంట్లు, ఇంట్లో వేసుకునే ఈ లుంగీలు తప్ప నాకంటూ ఖర్చులేదు. నేను సింపుల్ మేన్‌ని. చేతిసంచీ, కాళ్ళకి స్లిప్పర్స్‌తో వచ్చిన మీ అమ్మ ఐశ్వర్యాన్ని ఆవిడ బీరువాల్లో, ఒంటిమీద నువ్వు చూడచ్చు. అదంతా నా కష్టార్జితమే."

"ఆలికి అన్నం పెట్టడం ఊరికి ఉపకారం అన్నాట్ట వెనకటికి ఎవరో" సులోచన ఎగతాళిగా చెప్పింది.

"అమ్మా ప్లీజ్" శ్రీకర్ వారించాడు.

"రిటైరయ్యాక నాకు చాలా పెద్ద మొత్తం వచ్చింది. పెన్షన్ కూడా ఏభైవేలదాకా వస్తుంది. నువ్వు సెటిలయ్యావు. మాకు ఆర్థికంగా ఏం బాధలు లేవు. ఆరోగ్యంగా ఉన్నాం. ఆర్నెల్ల క్రితం నేను వాకింగ్‌కి వెళ్ళినప్పుడు పార్క్‌లో నా పాత కొలీగ్ కనిపించాడు. ఓ అమ్మాయి ఏడుస్తూ ఏదో చెప్తుంటే, అతను తలని అడ్డంగా ఊపుతూ చిరాకు పడుతున్నాడు. నేను దగ్గరకి వెళ్ళగానే చెప్పాడు.

"దివాకర్‌గారూ మీరు ఈ పిల్లకేమైనా హెల్ప్ చేయగలరా?"

ఆ అమ్మాయి పేరు జ్యోతి. ఎమ్ సెట్‌లో ఇంజనీరింగ్‌లో రేంక్ వచ్చింది. మర్నాడు కౌన్సిలింగ్. ఫీజ్ కట్టడానికి డబ్బు లేక మా కొలీగ్‌ని అడుగుతోంది.

"వీళ్ళు మా ఇంటి పక్కనే ఉంటారండి. తండ్రిలేడు. తల్లి మా ఇంట్లో వంట చేస్తుంది. మా పనిమనిషి రాకపోతే ఈ పిల్ల వచ్చి గిన్నెలు తోమి వెళ్తూంటుంది. రేపు కౌన్సిలింగ్, ఫీజ్ వెంటనే కట్టాలి అంటే నేనెక్కడినించి తేను?" అతను విసుగ్గా చెప్పాడు.

"నాకు చాలా బాధ కలిగింది. ఆ అమ్మాయి నావంక ఆశగా చూస్తోంది. నేను వివరాలు అడిగాను. మంచి రేంకే వచ్చింది కానీ అగ్రకులం అవడంతో రిజర్వేషన్స్ లేక ఫ్రీ సీట్ రాదని చెప్పింది. నాకెందుకో ఆ అమ్మాయికి సహాయం చేయాలనిపించింది. ఏటియంలో పాతికవేలు డ్రాచేసి ఆ అమ్మాయికిచ్చాను. ఇంటికి రాగానే మీ అమ్మ అడిగింది. 'పాతికవేలు డ్రాచేసారెందుకు?' తన ఫోన్‌కి బేంక్ నుంచి ఎస్సెమ్మెస్ వచ్చిందని అర్థమైంది. నేనేం చెప్పలేదు. చాలాసార్లు వెంటబడి అడిగింది. చివరికి చెప్పాను. 'ఇట్లా దానాలు చేస్తూపోతే అడుక్కుతింటాం' అంది. నాకు అసహ్యం వేసింది. నేను సంపాదించిన కోట్లలోంచి పాతికవేలు స్వంతానికి ఖర్చుపెట్టుకునే హక్కులేదా? అనిపించింది. మర్నాడు పార్క్‌లో ఆ అమ్మాయి నాకోసం వేచివుంది. ట్రిపుల్ ఈలో సీట్ వచ్చిందని ఆనందంగా చెప్పింది. ఆమె కోసం ముందే నేను వాకింగ్‌కి చెక్‌బుక్‌ని తీసుకెళ్ళాను. ఫీజు వివరాలు కనుక్కుని నాలుగేళ్ళకి ఎంతవుతుందో, ప్రాక్టికల్స్, కాలేజ్ దాకా బస్‌లాంటి వన్నీ లెక్కేసి ఓ పదివేలు ఎక్కువ కలిపి, ఆ మొత్తానికి జ్యోతికి చెక్ ఇచ్చి చెప్పాను.

"నాలుగేళ్ళు ప్రతీ ఏడాది నేను ఇవ్వడం, నువ్వు ఫీజు కట్టడం అంటే కష్టం. బేంక్ ఎకౌంట్ ఓపెన్ చేసి ఈ చెక్ డిపాజిట్ చెయ్. కేష్ క్రెడిట్ అయ్యాక సగం అమౌంట్ రెండేళ్ళకి ఎఫ్‌డి వెయ్. మిగతా సగం హేండీగా ఉంచుకో, ఏ ఖర్చులొస్తాయో తెలీదుగా"

ఆ అమ్మాయి ఏడుస్తూ నాకాళ్ళమీద పడింది. తను వేసుకున్న పంజాబీ డ్రెస్ అంతా చిరుగులు. చిన్న చిన్న చిల్లులు. ఎవరో దయగా ఇచ్చిందేమో, తన సైజ్ కూడా కాదు. ఇలాంటి డ్రెస్‌లతో కాలేజీకి ఎలా వెళ్తుంది అనిపించింది. దాంతో నావెంట రమ్మని ఏటియంలో మళ్ళీ పాతికవేలు డ్రా చేసిచ్చి, బట్టలు, పుస్తకాలు కొనుక్కోమని చెప్పాను. ఇంటికి వచ్చేసరికి మీ అమ్మ భద్రకాళిలా నాకోసం ఎదురుచూస్తోంది. అరగంట వ్యవధిలోనే నేను ఒకరికి దేవుడినైతే మరొకరికి దెయ్యానయ్యాను. 'మళ్ళా పాతికవేలు! ఏం చేస్తున్నారు ఈ డబ్బంతా?' గర్జించింది. గత ముప్పై ఐదేళ్ళుగా నేను ఈ ప్రశ్న తనని ఏనాడూ అడగలేదు. నాకు ఆక్షణంలో సులోచన మీద విరక్తి కలిగింది." దివాకర్ ఆగి గట్టిగా ఊపిరి తీసుకున్నాడు.

"ఆ వివరాలు తనకి చెప్పాలనిపించలేదు. ఆ తర్వాత యాదృచ్ఛికంగా ఖర్చులువచ్చాయి. ఇల్లు, ఆఫీస్ తప్ప మరో లోకంలేని నన్ను రిటైర్మెంట్, సిద్ధార్థుడు బుద్ధుడిగా మారినట్లుగా మార్చింది. లోకంలో ఎన్నో కష్టాలు. ఎన్నో వ్యాధులు, ఎన్నో బాధలు. ఆర్థికంగా తీరే కష్టాలని నా పరిధిలో నేను కొంత సాల్వ్ చేయచ్చుగా అనిపించింది. అలాగే నా విచక్షణ నాకు తెలుసు. నా సంపదలో సగం మీ అమ్మకి, పావువంతు నీకు, మరో పావువంతు నాకు అని లెక్కలు కట్టి, నా వాటాకి వచ్చినదాన్నే నేను ఖర్చుచేస్తున్నాను. ఇదంతా నా స్వార్జితం. నా రెక్కల కష్టం. నా ఆస్థి మీద నాకు హక్కులేదా బాబీ? నిన్న మీ అమ్మ ఏమందో తెలుసా?" ఆయన కంఠం దుఃఖంతో పూడుకుపోయింది.

"ఊరుకోండి నాన్నా" శ్రీకర్ ఓదార్పుగా ఆయన చేతులని తన చేతుల్లోకి తీసుకున్నాడు.

"నన్ను పిచ్చాసుపత్రిలో చేర్పిస్తుందిట! నన్ను కంట్రోల్ చేయడం తనవల్ల కావడంలేదుట"

శ్రీకర్ తల్లివంక తీక్షణంగా చూసాడు.

"ఆ నిమిషంలోనే మీ అమ్మకి నాకు మానసికంగా విడాకులైపోయాయి బాబీ. లోకం కోసం కలిసి బతకడమే తప్ప ఆ మనిషి మీద నాకు రవ్వంత ప్రేమకూడా మిగలలేదు. డబ్బు మీద మనం స్వారీ చేయాలి కానీ డబ్బుని మనమీద స్వారీ చేయనివ్వకూడదు. భర్తని పిచ్చాసుపత్రిలో పెట్టి ఆ డబ్బుతో మీ అమ్మ ఏం సుఖపడుతుందో, ఆవిడకి ఇంకా తీరని కోరికలేమున్నాయో కనుక్కోరా బాబీ" దివాకర్ భార్యవైపు చూడకుండా కొడుకుతో చెప్పాడు.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***